


వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

TE TL/26/A2635




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:86 | 08-08-2026 శనివారం | పేజీలు: 08 | వెల 3/-





## రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం

2

- నాగార్జునసాగర్‌లో ఆగస్టు 10న వైదిక క్రతువు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రభుత్వ ఆధ్వర్యంలో యాగం
- 11 హోమకుండాల్లో 108 మంది ఋత్విక్కులు, వేద పండితులతో నిర్వహణ
- కృష్ణా, గోదావరి నదులకు భారీగా వరద నీరు రావాలని ప్రత్యేక ప్రార్థనలు
- మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతి.. పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి



## నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

- ఎల్‌నినోపై రైతులకు ముందస్తు మార్గదర్శకాలు
- సాగర్, ఎస్ఆర్ఎస్‌పీలో నీటి నిల్వలు ఇంకా తక్కువే
- తాగునీటి నిల్వలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ స్మార్ట్ కార్డులు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

# కేటీఆర్ బాటలో హరీష్ రావు

- ఇక నోటీసులతోనే సమాధానం

## కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కొత్త కౌంటర్..

- వ్యక్తిగత ఆరోపణలపై చట్టపరమైన చర్యలకు గులాబీ పార్టీ సిద్ధం
- హరీశ్‌రావుపై క్షుద్ర పూజల ఆరోపణలతో మొదలైన వివాదం
- ఇక నేతలపై ఆధారాలు లేని వ్యాఖ్యలు చేస్తే లీగల్ నోటీసులు
- సోషల్ మీడియాలో ఆరోపణల వేగానికి ముందే అడ్డుకట్ట వేయాలన్న వ్యూహం

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు కొత్త మలుపు తిరుగుతోంది. ఇప్పటివరకు విమర్శలకు విమర్శలతోనే సమాధానం ఇచ్చిన బీఆర్ఎస్.. ఇక వ్యక్తిగత ఆరోపణల విషయంలో చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోవాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే వెంటనే లీగల్ నోటీసులు పంపించి బాధ్యత వహించేలా చేయాలన్నది కొత్త వ్యూహంగా చెబుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలకు పాల్పడ్డారంటూ చేసిన ఆరోపణలు ఈ మార్పుకు కారణంగా మారాయి. వర్షాలు కురవకుండా ఉండేందుకు ఆయన పూజలు చేయిస్తున్నారన్న వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా ఇదే అంశంపై వ్యాఖ్యలు చేయడంతో హరీశ్‌రావు చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన నేతలకు న్యాయపరమైన నోటీసులు పంపించి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలోనూ బీఆర్ఎస్ నేతలు తమపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన ప్రత్యర్థులకు న్యాయపరమైన నోటీసులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తనపై ఆరోపణలు చేసిన అప్పటి మంత్రి కొండా సురేఖకు

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణ.. పెట్టుబడులకు గమ్యస్థానం

- బే ఏరియా పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- అమెరికా పర్యటనలో ప్రవాస భారతీయులతో సమావేశం
- డిప్యూటీ సీఎం గౌరవార్థం భారత కాన్సుల్ జనరల్ విందు

2

## తాగునీటి విప్లవానికి నిదర్శనం మిషన్ భగీరథ

- పదేళ్లు పూర్తి చేసుకున్న పథకం.. దేశానికి ఆదర్శంగా నిలిచిందన్న హరీశ్‌రావు
- ఫ్లోరోసిస్ నిర్మూలనలో మిషన్ భగీరథ కీలక పాత్ర
- 'హర్ ఘర్ జల్'కు ఈ ప్రాజెక్టే ఆదర్శమని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పథకం నిర్వీర్యమవుతోందని ఆరోపణ



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో..



3

## తెలంగాణ.. పెట్టుబడులకు గమ్యస్థానం

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గౌరవార్థం శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె.శ్రీకర్ రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.



## జీఎస్టీ ఎగవేతకు ఏఐతో చెక్

- పన్నుల రాబడి పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక కసరత్తు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో సంస్కరణలకు ప్రణాళిక
- నిర్మాణ రంగంలోని పన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల అనుసంధానం

3

## చేనేత సంక్షోభంపై కేటీఆర్ బహిరంగ లేఖ

- నిలిచిపోయిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి.. నేతన్నల హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి డిమాండ్
- కేసీఆర్ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు నిలిచిపోయాయని ఆరోపణ
- కేంద్రం తీసుకున్న నిర్ణయాలు కూడా చేనేత రంగానికి నష్టం చేశాయని వ్యాఖ్య



2

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా ఉన్న చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్




2

- పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ
- అన్ని గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ
- ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

## రాష్ట్ర సుభిక్షం కోసం
# మహా వరుణ యాగం

**నాగార్జునసాగర్, ఆగస్టు 7:**
తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహా వరుణ యాగం నిర్వహించనున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వాతావరణ ప్రతికూలతలు తగ్గి జలాశయాలు నిండాలని సంకల్పిస్తూ నాగార్జునసాగర్ వేదికగా ఈ వైదిక క్రతువుకు శ్రీకారం చుట్టనున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి శాస్త్రోక్తంగా చర్చించి ఆగస్టు 10ను యాగానికి శుభ ముహూర్తంగా నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**108 మంది ఋత్వికులతో ప్రత్యేక పూజలు**
యాదగిరిగుట్ట క్షేత్రానికి చెందిన అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య యాగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రాంగణంలో 11 హోమకుండాలను సిద్ధం చేస్తున్నారు. సుమారు 108 మంది ఋత్వికులు, వేద పండితులు క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదుల్లోకి సమృద్ధిగా వరద నీరు చేరాలని, డ్యామ్‌లు, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండాలని యాగంలో సంకల్పించనున్నారు. రాష్ట్ర రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

**ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు**
రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో యాగానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆగస్టు 10న రోజంతా జరిగే వైదిక కార్యక్రమాలు మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతితో ముగియనున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి జలవనరులు నిండాలని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండాలని ఈ సందర్భంగా యాగం ద్వారా ఆకాంక్షించనున్నారు.

## తాగునీటి విప్లవానికి నిదర్శనం
# మిషన్ భగీరథ

**మొదటిపేజీ తరువాయి**
సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మిషన్ భగీరథకు సంబంధించిన ప్రత్యేక వీడియోను పంచుకున్న ఆయన.. ఇది కేవలం ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల తాగునీటి కష్టాలకు పరిష్కారం చూపిన మహత్తరమైన తాగునీటి విప్లవమని పేర్కొన్నారు.

**దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రాజెక్ట్**
దశాబ్దం క్రితం రూపొందించిన మిషన్ భగీరథ తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి ఇంటికీ నిరంతరాయంగా స్వచ్ఛమైన నల్లా నీరు అందించేలా ఏర్పాటైన ఈ వ్యవస్థ దేశంలోనే అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను దశాబ్దాలుగా వేధించిన ఫ్లోరోసిస్ సమస్యను నిర్మూలించడంలోనూ మిషన్ భగీరథ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'హర్ ఘర్ జల్' కార్యక్రమానికి మిషన్ భగీరథ ఆదర్శంగా నిలిచిందని, దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్టుకు ప్రశంసలు లభించాయని హరీశ్‌రావు గుర్తుచేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**
మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టి, ఆచరణాత్మక ఆలోచనలకు మిషన్ భగీరథ ప్రత్యక్ష నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పథకం నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. గతంలో నిరంతరం నీరు సరఫరా చేసిన నల్లాలు ఇప్పుడు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
మిషన్ భగీరథను ప్రభుత్వం తక్షణమే సమర్థంగా నిర్వహించి ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజల జీవితాలతో ముడిపడిన ఈ పథకం మౌలిక లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫీజు వివరాలు నోటీసు
# బోర్డులో పెట్టాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 7:**
తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి ప్రైవేట్ పాఠశాల తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.

**విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు**
ఫీజుల వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో తెలిపే పత్రాలతో పాటు పాలకవర్గ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై తల్లిదండ్రులకు స్పష్టత లభించనుంది.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
జీఓ ఎంఎస్ నంబర్ 1 (1994)లోని నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై అదే జీఓలోని రూల్ 11 ప్రకారం అనుమతులు లేదా గుర్తింపు రద్దు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

# కేటీఆర్ బాటలో హరీష్ రావు

**మొదటిపేజీ తరువాయి**
నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలను ఇకపై రాజకీయ విమర్శలుగా వదిలేయకుండా చట్టపరంగా ఎదుర్కోవాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల ప్రభావం పెరగడంతో ఒక ఆరోపణ క్షణాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరుతోందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి వివరణ ఇచ్చేలోపే నష్టం జరిగిపోతోందని, అందుకే ముందుగానే న్యాయపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా నిరాధార ప్రచారానికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి తమపై విమర్శలు మరింత పెరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఇకపై ప్రతి ఆరోపణకు రాజకీయ ప్రకటనలతోనే స్పందించకుండా, అవసరమైన సందర్భాల్లో న్యాయపరమైన మార్గంలో గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం కాస్తా నోటీసుల పోరుగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

# చేనేత సంక్షోభంపై కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 7:**
తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా ఉన్న చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



**బీమా, చేయూతతో భరోసా**
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించేలా ప్రభుత్వం తన వాటాను జమ చేసిన 'నేతన్నకు చేయూత' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీకి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించామని కేటీఆర్ గుర్తుచేశారు.

**కాంగ్రెస్ హామీలపై ప్రశ్నలు**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేసిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. చేనేత భరోసా కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణమాఫీ, జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు.

> **కేంద్రంపైనా విమర్శలు**
> చేనేత రంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని కేటీఆర్ ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డుల రద్దు, పలు సంక్షేమ పథకాల నిలిపివేత, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ వంటి నిర్ణయాలు రంగాన్ని దెబ్బతీశాయని అన్నారు. చేనేత విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని విమర్శించారు.

**పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్**
నేతన్నల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేటీఆర్ కోరారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నికల హామీలను అమలు చేసి నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. నేతన్నల జీవనోపాధిని కాపాడితేనే చేనేత రంగం, తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం నిలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# ములాఖత్‌ల మతలబు ఏమిటో?

**హైదరాబాద్, ఆగస్టు 7:**
తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా కనిపిస్తున్న అంతర్గత విభేదాలకు భిన్నంగా వరుసగా చోటుచేసుకుంటున్న నేతల భేటీలు ఇప్పుడు పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమావేశమై ఆత్మీయంగా మాట్లాడుకోవడం, అనంతరం మూడు జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకాలు పూర్తవడం వెనుక అసలు మతలబేంటన్న చర్చ మొదలైంది.



బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం చాలాకాలంగా పార్టీలో ఉంది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనూ కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయి. అలాంటి నేతలు ఒకే ఇంట్లో సమావేశమై కలిసి భోజనం చేయడం పార్టీ శ్రేణులకు కొత్త దృశ్యంగా మారింది.
ఈ భేటీకి ముందే తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ఢిల్లీలో పలువురు ఎంపీలతో సమావేశమైనట్లు సమాచారం. ఆ తర్వాత బండి సంజయ్ నివాసంలో ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ కావడం, ఆ వెంటనే నెలలుగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్ష పదవులను భర్తీ చేయడం వరుస పరిణామాలపై ఆసక్తిని పెంచింది. సమావేశంలో పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ కూడా పాల్గొన్నట్లు సమాచారం.

**మూడు పదవుల వెనుక ఏం జరిగింది?**
తెలంగాణ బీజేపీలో 38 సంస్థాగత జిల్లాలు ఉన్నాయి. ఇప్పటికే 36 జిల్లాల అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు జిల్లాల అధ్యక్ష పదవులు మాత్రం నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.
కరీంనగర్‌లో బండి సంజయ్, మేడ్చల్ అర్బన్‌లో ఈటల రాజేందర్ తమకు అనుకూలమైన వ్యక్తులకు అవకాశం కల్పించాలని పట్టుబట్టినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. దీంతో నియామక ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా మూడు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించడంతో ఈ వివాదానికి ముగింపు పలికినట్లయింది. కొత్తగా నియమితులైన వారిలో ఎంపీలు సూచించిన వ్యక్తులకే అవకాశం దక్కిందన్న ప్రచారం కూడా పార్టీలో జరుగుతోంది. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగిన పీటముడి ఎలా వీడింది? నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందా? లేక ఎవరి పంతం వారికి నెరవేరిందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**వరుస భేటీల వెనుక సయోధ్యేనా?**
మూడు జిల్లాల అధ్యక్షుల నియామకానికి ముందు చోటుచేసుకున్న కీలక భేటీలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్య నేతల మధ్య దూరాన్ని తగ్గించేందుకు పార్టీ అధిష్ఠానం నుంచి ఏదైనా ప్రయత్నం జరిగిందా? రాష్ట్రంలో పార్టీని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు నేతల మధ్య అవగాహన కుదిరిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
అయితే భేటీల్లో ఏ అంశాలపై చర్చ జరిగిందన్నది మాత్రం అధికారికంగా వెల్లడికాలేదు. రాజకీయంగా ఎలాంటి కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయన్నది కూడా స్పష్టత లేదు. ఇన్నాళ్లూ ఎడముఖం పెడముఖంగా కనిపించిన నేతలు ఒకే చోట కూర్చొని మాట్లాడుకోవడం మాత్రం పార్టీకి సానుకూల పరిణామమేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలయిక కేవలం జిల్లాల అధ్యక్షుల నియామకానికే పరిమితమా? లేక రాబోయే రోజుల్లో రాష్ట్ర బీజేపీలో విభేదాలకు చెక్ పెట్టే కొత్త అధ్యాయానికి నాందియా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అధికారంలోకి రావడమే
# బీజేపీ టార్గెట్

**ఢిల్లీ, ఆగస్టు 7:**
వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదన్నారు. జనసేన సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పారు. అయితే ఎన్డీయే కూటమిలో జనసేన భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఢిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రామచందర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబిన్ దిశానిర్దేశం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబిన్ రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గవ్ కనెక్ట్(GOVconnect), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ(మీసేవ) సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలో శుక్రవారం నిర్వహించిన ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు. డిజిటల్ కేబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్‌బోర్డు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ వంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్ద పీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.




కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 7:**
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయమైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీలైన జిల్లాల్లో రేపటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మండళ్లు కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండుమూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంతమేర సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు. ప్రధాన జలాశయాల పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదంటూ ఆయా కమాండ్ ఏరియాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్(జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.

# జీఎస్టీ ఎగవేతకు ఏఐతో చెక్

**హైదరాబాద్, ఆగస్టు 7:**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల ఎగవేతకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సాంకేతికతను విస్తృతంగా వినియోగించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సమావేశమై వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై చర్చించారు. జీఎస్టీ రాబడులను పెంచడం, పన్నుల లీకేజీలను గుర్తించడం కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

**నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి**

భవన నిర్మాణ రంగంలో పన్నుల ఎగవేతకు అవకాశం లేకుండా వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ ద్వారా సమన్వయం చేయనున్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతులు ఇచ్చే దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసేలా వ్యవస్థను రూపొందించనున్నారు.

**వ్యాపారులకు ఇబ్బంది లేకుండా..**

పన్నుల వసూళ్లు పెంచే క్రమంలో వ్యాపారులను అనవసరంగా ఇబ్బంది పెట్టకూడదని సీఎం స్పష్టం చేశారు. సులభతర వాణిజ్యానికి ప్రాధాన్యం ఇస్తూనే పన్నుల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. అధికారులకు అవసరమైన సమాచారాన్ని కృత్రిమ మేధ ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తనిఖీలు, పన్నుల వసూళ్లను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.

**ప్రభుత్వ సేవల సమాచారాన్ని ఒకే చోటకు..**

పన్నులకు సంబంధించిన సమాచారంతో పాటు మీ సేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల వివరాలను కూడా సమగ్ర సమాచార వ్యవస్థలోకి తీసుకురావాలని సీఎం సూచించారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలో పారదర్శకత పెరగడంతో పాటు నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ఎక్సైజ్ కార్యదర్శి రఘునందన్‌రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అధికారులను కోర్టుకు పిలిపించడం బాధగా ఉంది

**హైదరాబాద్, ఆగస్టు 7:**

కోర్టు ధిక్కరణ వ్యవహారంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని, అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పు వల్ల అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని, తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని, రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని, ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది

## 15న 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం**
- **మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 7 :**

రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం నాడు సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెల 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ప్రారంభించడంతోపాటు రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల్లోనూ అదే రోజు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం ఒక చరిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఆహార భద్రతను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దేశంలో అత్యంత సమర్థవంతమైన ఆహార భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన ఈ మహత్తర కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం ఆనందదాయకంగా ఉందన్నారు.

## తెలంగాణ.. పెట్టుబడులకు గమ్యస్థానం

**శాన్ ఫ్రాన్సిస్కో, ఆగస్టు 7 :**

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గౌరవార్థం శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె.శ్రీకర్ రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బే ఏరియాలోని ప్రముఖ ప్రవాస భారతీయులతోపాటు ఐటీ, వైద్య, మానవ వనరులు, ఇతర వ్యాపార రంగాలకు చెందిన విశిష్ఠ నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. ఐటీ ఆవిష్కరణల్లో హైదరాబాద్ అగ్రగామి. టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాలలో భారతదేశపు ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఎదుగుతోందని గుర్తు చేశారు. ఈ వృద్ధి వేగాన్ని ఇలా కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న సరికొత్త రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం కొత్త పునాదులు వేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పారదర్శకమైన, పెట్టుబడులకు అనుకూలమైన ప్రగతిశీల అభివృద్ధి నమూనాను అనుసరిస్తోందన్నారు. కొత్త ఆలోచనలను సంస్థలుగా మార్చడంలో, నాణ్యమైన ఉపాధిని సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సభకు వివరించారు. చారిత్రక మూసీ నది పునరుద్ధరణ, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తెలంగాణ యువతను భవిష్యత్ ఉద్యోగాలకు, ప్రపంచస్థాయి పోటీకి సన్నద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతోపాటు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



**డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం**

శాన్ ఫ్రాన్సిస్కో చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన శాన్ ఫ్రాన్సిస్కో భారత కాన్సులేట్ జనరల్ నహజ్ అలీ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అలాగే ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు, ప్రవాస తెలంగాణవాసులు, అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి బ్రహ్మరథం పట్టారు.

**దేశ ప్రగతిలో భాగస్వాములు**

**కావాలి : కాన్సుల్ జనరల్**

తొలుత సభికులకు స్వాగతం పలికిన కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. భారత్‌లో సమ్మిళిత ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతూనే ప్రవాసులకు సైతం ప్రయోజనం చేకూర్చేలా బలమైన భాగస్వామ్యాలను అన్వేషించాలని వ్యాపార వర్గాలను కోరారు. సమావేశం అనంతరం పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలు తదితర అంశాలపై ఎన్నారైలు, బే ఏరియా ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంతో అమెరికాలోని ప్రవాస భారతీయుల మధ్య బలమైన సంస్థాగత సంబంధాలు ఏర్పరచుకునే దిశగా ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరిగాయి. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐవోసీ నాయకులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భర్తను హత్య చేయించేందుకు భార్య కుట్ర!

- **ప్రియుడితో కలిసి రోడ్డు ప్రమాదం సృష్టించాలని పథకం..**
- **చాటింగ్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు**

**మహబూబాబాద్, ఆగస్టు 7:**

దాంపత్య బంధాన్ని మరిచి ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు రావడం మహబూబాబాద్ జిల్లా దోర్నకల్లు మండలంలో కలకలం రేపింది. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి భర్తను హతమార్చాలని ప్రియుడితో ఆమె చేసిన చాటింగ్ వెలుగులోకి వచ్చినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ భార్యతో పాటు ఆమె ప్రియుడు పురిమెట్ల సైదులుపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

**చాటింగ్‌లో వెలుగులోకి వచ్చిన కుట్ర**

దోర్నకల్లు మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రభాత్ నగర్‌లో నివసిస్తూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జూలై 27న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లిన సమయంలో తన భార్య మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటాన్ని గుర్తించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో తెలిపాడు. ఈ విషయంపై కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నాడు. మరుసటి రోజు తన అన్నను తీసుకురావడానికి వెళ్లిన సమయంలో ఓ వ్యక్తి తనను వెంబడించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. అనంతరం భార్య ఫోన్‌ను పరిశీలించగా ప్రియుడితో ఆమె జరిపిన సంభాషణలు బయటపడినట్లు తెలిపాడు. తనను ఎలాగైనా హత్య చేయించాలని ఆమె ప్రియుడితో చాటింగ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రోడ్డు ప్రమాదం జరిగేలా చేసి తనను అంతమొందించాలని ఆమె ఒత్తిడి చేసినట్లు చాటింగ్‌లో ఉన్నట్లు ఆరోపించాడు.

**జీరో ఎఫ్ఐఆర్ నమోదు**

తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ రాజేశ్వరరావు దోర్నకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అనంతరం బాధితుడు ఖమ్మం గ్రామీణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. కేసులో సమర్పించిన మొబైల్ చాటింగ్, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవాలి

**హైదరాబాద్, ఆగస్టు 7:**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలచుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లో కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయన్నారు. పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హిప్లెక్స్2026 (Hyderabad International Plastics Expo2026) ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని అన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని చెప్పారు.

**పాలిమర్ రంగం దేశ తయారీ రంగానికి వెన్నెముక**

ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటి మందికి పైగా పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే ఈ రంగంపై సుమారు రెండు లక్షల మంది జీవనోపాధి ఆధారపడి ఉందని వివరించారు. పాలిమర్ రంగం అభివృద్ధి చెందితే తయారీ రంగం విస్తరిస్తుందని, దాంతో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.



**మందగమనం తాత్కాలికమే..**

**పరిశ్రమల ధైర్యం శాశ్వతం**

గత ఆర్థిక సంవత్సరంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, పాలిమర్ ధరల అస్థిరత, రవాణా, విద్యుత్ వ్యయాల పెరుగుదల, కార్మికుల కొరత వంటి అంశాలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధికి సమాంతరంగా అభివృద్ధి చెందే పాలిమర్ రంగం గత ఏడాది కేవలం 2.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసిందన్నారు. పీవీసీ పైపులు, హెచ్‌డీపీఈ పైపులు, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల్లో మందగమనం కనిపించినప్పటికీ పరిశ్రమల్లో విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. హిప్లెక్స్2026కు లభించిన విశేష స్పందనే దేశ పారిశ్రామిక రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చరిత్ర చెబుతున్నదేమిటంటే సంక్షోభ సమయాల్లోనే గొప్ప పరిశ్రమలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు.

**సమగ్ర ప్రతిపాదనలు ఇస్తే పరిశీలిస్తాం**

పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐపీఎంఏ, టాప్మా, ఐపీఐ వంటి పరిశ్రమల సంఘాలు విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి విధానపరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలతో నిరంతర సంప్రదింపులే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**పాలిమర్ రంగంలోనూ తెలంగాణకు అగ్రస్థానం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన విజయాలను పాలిమర్ రంగంలోనూ పునరావృతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, మెడికల్ ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్ టెక్నాలజీలు, పాలిమర్ కాంపౌండింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ, ఈవీ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, బయో ఆధారిత పాలిమర్ల రంగాల్లో తెలంగాణకు అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**2030 నాటికి 20 లక్షల టన్నుల వినియోగ లక్ష్యం**

ప్రస్తుతం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కలిపి సుమారు 13 లక్షల టన్నుల పాలిమర్ వినియోగం ఉందని, ప్రభుత్వంపరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే 2030 నాటికి ఇది 20 లక్షల టన్నులకుపైగా చేరుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరులు, పారిశ్రామిక వాతావరణం తెలంగాణలో ఉన్నందున దేశంలోనే ప్రముఖ పాలిమర్ తయారీ, ప్రాసెసింగ్ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలని పేర్కొంటూ గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలను అనుసరించే పరిశ్రమలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. పెట్టుబడులు కొనసాగిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించాలని, ప్రతి అడుగులోనూ ప్రభుత్వం పరిశ్రమలకు అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రదర్శనలో 550కు పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించనుండగా భారత్‌తోపాటు విదేశాల నుంచి 50వేలకు పైగా వ్యాపార సందర్శకులు హాజరుకానున్నారు. ఈ ప్రదర్శనలో గుజరాత్‌కు చెందిన సుమారు 160 కంపెనీలు, తెలంగాణ, ఏపీలకు చెందిన 110 ఎగ్జిబిటర్లు, చైనాకు చెందిన దాదాపు 40 కంపెనీలు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బద్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఏఐపీఎంఏ ఉపాధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు ఆధునిక సాంకేతికత.. నేతన్నలకు మరింత అండ

- **2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచే లక్ష్యం**
- **జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన**
- **వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు**
- **పీఎల్ఐ, ముద్ర రుణాలు, ముడిసరుకు పథకాలతో నేత కార్మికులకు ప్రోత్సాహం**
- **చేనేతలో ఏఐ, ఆటోమేషన్ వినియోగంతో ఉత్పాదకత పెంపు**



**హైదరాబాద్, ఆగస్టు 7:**

చేనేత, వస్త్ర పరిశ్రమను మరింత బలోపేతం చేసి భారతదేశాన్ని ప్రపంచ వస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత, వస్త్ర పరిశ్రమ కీలకమైనదని పేర్కొన్నారు. ఈ రంగం ద్వారా దాదాపు ఐదు కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని తెలిపారు.

**2030 నాటికి రూ.9 లక్షల కోట్ల ఎగుమతులు**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మేక్ ఇన్ ఇండియా'తో పాటు 5ఎఫ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. పొలం నుంచి నార, నార నుంచి వస్త్రం, వస్త్రం నుంచి ఫ్యాషన్, ఫ్యాషన్ నుంచి విదేశీ మార్కెట్ల వరకు సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ విధానం లక్ష్యమన్నారు. 2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

**నేతన్నలకు పథకాలతో ప్రోత్సాహం**

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం, పీఎం మిత్ర పార్కులు, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడిసరుకు సరఫరా పథకం, వీవర్స్ ముద్రా పథకం ద్వారా నేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, ముడిసరుకు, రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక భద్రతను కూడా బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్**

తెలంగాణలోని వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించే చర్యల్లో భాగంగా కేంద్రం ఇప్పటివరకు రూ.69,860 కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. రైతుల నుంచి ముడిసరుకు సేకరణ నుంచి వస్త్ర తయారీ, ఎగుమతుల వరకు మొత్తం వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. చేనేత రంగంలో కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పాదకత, నాణ్యతను పెంచుతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుతూ నేతన్నలకు అండగా నిలవడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. దేశ ప్రజలు చేనేత వస్త్రాలను ఎక్కువగా వినియోగించి నేత కార్మికులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

## అక్రమ గుడుంబా తయారీపై ఎక్సైజ్ శాఖ భారీ దాడులు ఎనిమిది మంది అరెస్ట్



మంగపేట ఆగష్టు07డీడీ9 వార్త

అక్రమంగా గుడుంబా తయారీ మరియు నిల్వ చేస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ధారావత్ సుజాత, లోంక రాజేశ్వర్, దారావత్ సారక్క, బోయ్స్ సునీత, లక్ష్మి, ఇస్లావత్ కమలావతి, అజ్మీత రాజేశ్వర్, తుర్క స్టిను, పోరిల లక్ష్మీదేవి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. దాడుల సందర్భంగా సుమారు 41 లీటర్ల గుడుంబా, 1,300 లీటర్ల నల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక మోటార్ సైకిల్ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలు అసిస్టెంట్ కమిషనర్ నవీన్, స్థానిక సీఐ కిషోర్, ఎన్ఫోర్స్మెంట్ సీఐ నాగయ్య, సీఐ నాగేశ్వరరావు, జిల్లా టాస్క్ఫోర్స్ సీఐ రాజసయ్య, రాష్ట్ర టాస్క్ఫోర్స్ సీఐ బిక్షారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం



- ప్రపంచ తల్లి పాల వారోత్సవంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి
- 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు

పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 07 (డీడీ9 వార్త):

రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ గారి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం మేయర్ మహంకాళి స్వామి, 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంగళ బాపు, సిరిశెట్టి సతీష్, కాంగ్రెస్ నాయకులు కల్వల రంజిత్, సిమ్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, మెడికల్ విద్యార్థులు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష..

- ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి
- భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- ఎస్ఎన్సీయులో కోలుకున్న శిశువులకు బారసాల నిర్వహణ



భద్రాచలం టౌన్, ఆగస్టు 7 (డిడి9 వార్త)

సుస్థిరమైన జీవిత ప్రారంభానికి తల్లిపాలే శ్రేయకరమని భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను ఆయన ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషణను అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం ప్రారంభించాలని, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలని సూచించారు. ఆ తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడం అత్యంత అవసరమని వివరించారు. తల్లిపాలలో ఉండే పోషక విలువలు ఎదిగే వయస్సులో ఉన్న శిశువులకు ఎంతో మేలు చేస్తాయని, తల్లిపాలను మించిన దివ్య ఔషదం మరొకటి లేదని ఆయన పేర్కొన్నారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గత 21 రోజులుగా ఎస్ఎన్సీయు (SNCU) లో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న ఇద్దరు శిశువులకు ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఘనంగా బారసాల నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ మల్లేష్, వైద్యులు సంతోష్, విజయరావు, శ్రావణి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫ్లోరెన్స్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నాలాల ఆక్రమణలు సహించేది లేదు

- మురుగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 07 (డీడీ9 వార్త):

నాలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. వార్డు సందర్శనలో భాగంగా శుక్రవారం 3వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్, వినాయక్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ వద్లూరి రవితో కలిసి ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా డివిజన్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టి కాలువల్లో పూడిక తొలగింపు, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చి చెట్లు, పొదలను తొలగించే పనులను చేపట్టారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. కాలువల్లో పూడిక తొలగింపు పనులకు వాటిపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు అడ్డంకిగా మారుతున్నాయని తెలిపారు. దీంతో మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా ప్రవహించక ఇళ్లలోకి వరద నీరు చేరే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజలు నగరపాలక సంస్థకు సహకరించి కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. 3వ డివిజన్‌లో డ్రైనేజీలపై ఉన్న అక్రమ నిర్మాణాల కారణంగా మురుగునీరు నిలిచిపోతున్న ప్రాంతాలను గుర్తించామని, వాటిని తొలగించేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రామగుండం నగరాన్ని సమస్యా రహితంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే సహకారంతో అవసరమైన నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడతామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఏఈలు తేజస్విని, మనోజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ పిలుపు

మంగపేట ఆగష్టు07డీడీ9 వార్త



ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న నిర్వహించే వేడుకలను ప్రతి మండలం, ప్రతి గూడెంలో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు పిలుపునిచ్చారు. అలాగే ఆగస్టు 24న ఏటూరునాగారంలో నిర్వహించే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద కొమరం భీమ్ విగ్రహ ఆవరణలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీల ఐక్యతకు, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని గ్రామాలు, గూడెంల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మేడారం సమ్మక్క పూజారి చందా రఘుపతి, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొరగట్ల లక్ష్మణ్ రావు, ములుగు జిల్లా అధ్యక్షుడు నల్లెబోయిన లక్ష్మణ్ దొర, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వర్ రావు, గౌర అధ్యక్షుడు కుంజా నారాయణ, జిల్లా కార్యదర్శి గౌరబోయిన మోహన్ రావు, ములుగు డివిజన్ అధ్యక్షుడు పోడెం శోభన్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోడెం నాగేశ్వర్ రావు, తాడ్వాయి అధ్యక్షుడు మోకాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- మారుపేర్లు, విజిలెన్స్ కేసులపై బాధితుల ఆందోళన
- ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన

పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 0 7 (డీడీ9 వార్త):

సింగరేణి సంస్థలో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ కేసులను తక్షణమే పరిష్కరించి బాధిత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం రామగుండం రీజియన్ ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట బాధితులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాధితులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారంపై హామీ ఇచ్చిందని బాధితులు తెలిపారు. అలాగే గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ పలుమార్లు నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశాల్లో ఈ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులు పెండింగ్‌లో ఉండటంతో సింగరేణిలో పనిచేసిన కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అర్హత ఉన్నప్పటికీ తమకు రావాల్సిన ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించి అర్హులైన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని బాధితులు కోరారు.



## ఆశాడమాషా గోరింటాకు ఉత్సవాలు జరుపుకున్న ఊరట్టం ఆశ్రమ ఉన్నత పాఠశాల

ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు.

తాడ్వాయి డిడి9 వార్త

తెలుగు మసాలాలో నాలుగవ మాసం అయినా ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనేది సంప్రదాయం. ఈ గోరింటాకు పెట్టుకోవడం వలన వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధులు రాకుండా మన ఆరోగ్యం కాపాడుకోవచ్చని ఆధ్యాత్మికం చెప్తుంది కాబట్టి గౌరీ దేవికి ఇష్టమైన గోరింటాకు ప్రతి ఒక్కరు పెట్టుకోవాలి అని ఊరట్టం పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు



## లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించకుంటే సహించేది లేదు

- ఎల్బీనగర్ కాంప్లెక్స్ నిర్మాణాల కూల్చివేతపై సీపీఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆగ్రహం



పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 07 (డీడీ9 వార్త):

రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎల్బీనగర్ నుంచి 5 ఇంక్లైన్ వరకు రహదారి విస్తరణలో భాగంగా దుకాణాలు కోల్పోయిన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని సీపీఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య హెచ్చరించారు. ఒక్క లబ్ధిదారుడికి కూడా దుకాణం కేటాయించకుండా రాజకీయ కుట్రలకు పాల్పడితే సహించబోమని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారు వెనుకకు జరిగి దుకాణాలు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే, మేయర్ సూచించడంతో బాధితులు తమ సొంత డబ్బులతో ఎల్బీనగర్‌లో దుకాణాల నిర్మాణం చేపట్టారని సూర్య తెలిపారు. అయితే శుక్రవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి కాంప్లెక్స్‌కు అనుమతులు లేవంటూ నిర్మాణాలను కూల్చివేయడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలి

కాంప్లెక్స్ నిర్మాణం 11వ డివిజన్ పరిధిలో జరుగుతున్నప్పటికీ, దుకాణాలు కోల్పోయిన బాధితులు 41వ డివిజన్‌కు చెందిన వారేనని సూర్య పేర్కొన్నారు. బాధితులకు అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికీ దుకాణం వచ్చేలా పాలకులతో చర్చించిన అనంతరమే భూమిపూజ చేసి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి ప్రాథమిక విచారణ నిర్వహించకుండా నిర్మాణాలను కూల్చివేయడం సరైన పద్ధతి కాదన్నారు. అక్కడ నిజంగా లబ్ధిదారులు కాకుండా ఇతరులు దుకాణాలు నిర్మించుకుంటే విచారణ అనంతరం వాటిని తొలగించడం సమంజసమేనని, అయితే అందరినీ ఒకే గాటన కట్టి కూల్చివేయడం సరికాదన్నారు.

### కూల్చిన దుకాణాల బాధ్యత ఎవరిది?

ఎల్బీనగర్ కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఆరు దుకాణాలే ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, రేపటి విచారణలో అక్కడ పది దుకాణాలు ఉండేవని తేలితే కూల్చివేసిన నాలుగు దుకాణాలను ఎవరు నిర్మించి ఇస్తారని సూర్య ప్రశ్నించారు. ఎమ్మెల్యే సూచనలను నమ్ముకుని దుకాణాలు నిర్మించుకున్న పేదలను నట్టేట ముంచే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో ఎమ్మెల్యే సూచనల మేరకు దుకాణదారులు నిర్మాణాలు చేపడుతున్నారని, పేదల కడుపు కొట్టి వారిని రోడ్డుపాలు చేయవద్దని ఎమ్మెల్యేను కోరారు.

### లీగల్‌గా దుకాణాలకు అనుమతులు ఇవ్వాలి

సింగరేణి సీఎండీతో మాట్లాడి రామగుండం కార్పొరేషన్ పరిధిలోని సంబంధిత కాంప్లెక్స్‌ల దుకాణదారులకు ప్రొసీడింగ్ కాపీలు ఇప్పించి, టౌన్ ప్లానింగ్ ద్వారా నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని సూర్య కోరారు. భవిష్యత్‌లో ప్రభుత్వం లేదా ప్రజాప్రతినిధులు మారినప్పుడు అనుమతులు లేవనే కారణంతో దుకాణాలు కూల్చివేసే పరిస్థితి రాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. "ఎల్బీనగర్ ప్రజలకు సంబంధించిన ఏ ఒక్క లబ్ధిదారుడికి కూడా దుకాణం కేటాయించకుండా అన్యాయం చేస్తే సహించేది లేదు. దుకాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ తిరిగి దుకాణం వచ్చే వరకు పోరాటం చేస్తా" అని మార్కపురి సూర్య హెచ్చరించారు.

# సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని బాధితుల డిమాండ్

- **మద్దతు తెలిపిన తెలుగుదేశం అనుబంధ సంఘం టి ఎన్ టి యూ సి.**

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 8:**




రామగుండం: సింగరేణిలో గత కొన్ని సంవత్సరాలుగా మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల వల్ల సింగరేణిలో పనిచేసిన కార్మికుల కుటుంబాలకు న్యాయం జరగడం లేదని వారు ఆరోపించారు.శుక్రవారం రామగుండం రీజియన్ ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట బాధితులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు.ఈ యొక్క నిరసన దీక్షకు సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టిఎన్టియుసి పక్షాన మద్దతు తెలుపటం జరిగింది అదే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను టిఎన్టియూసి,తరపున డిమాండ్ ఏమిటంటే సింగరేణి కార్మికులు గత 30 నుండి 35 సంవత్సరాలు సర్వీస్ చేసి వారి పిల్లలకు ఉద్యోగం కల్పించాలని ఆశతో ఎదురుచూసి సూసి అలిసిపోయారు మళ్ళీ వారి పిల్లలు కూడా గత 12 సంవత్సరాల నుండి సింగరేణి యాజమాన్యం చుట్టూ తిరుగుతూ వారు కూడా అలిసిపోయే టట్లుగా వారి వయసు శరీర దృఢత్వం కోల్పోయే విధంగా ప్రభుత్వం వారిని ఇబ్బందులకి గురి చేస్తూ వారి ఆశలు నీరుగారెలా చేస్తుంది.తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకొని వారికి ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా వారిలో ఉద్యోగం కోసం ఇద్దరు చనిపోవడం జరిగింది వారికి తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కూడా టిఎన్టియుసి డిమాండ్ చేస్తుంది. అదేవిధంగా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే అంత వరకు టిఎన్టియుసి పక్షాన పోరాటం చేస్తుందని విన్నవించుకుంటున్నాము అదేవిధంగా ఈ పిల్లలకు ఉద్యోగం ఇవ్వనట్లయితే రానున్న రోజుల్లో ఈ పోరాటకైనా సిద్ధంగా ఉంటామని మరోసారి డిమాండ్ చేస్తున్నాం ఇట్లు కె నిమ్మకాయలు ఏడుకొండలు రాష్ట్ర సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి మణిరాం సింగ్ రాష్ట్ర సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రాష్ట్ర టిఎన్టియూసి,వైస్ ప్రెసిడెంట్ ముదిగంటి దామోదర్ రెడ్డి పెద్దపల్లి పార్లమెంట్ టి ఎన్ టి యూ సి, అధ్యక్షుడు పెగడపల్లి రాజనర్సు టి డి పి నగర అధ్యక్షులు,బెక్కం వీరేందర్ టీఎన్ఎస్ఎఫ్ మాజీ కార్యదర్శి, కామెర రాజబాబు ఎస్సీ సెల్ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు సుందిళ్ల స్వామి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీ నగర్ కూల్చివేతలపై బీజేపీ స్పందన

- **అక్రమ కబ్జాలకు కలెక్టర్ చెక్ పెట్టాలి.**
- **బాధితులకే రూములు కేటాయించాలి.**
- **ప్రభుత్వ స్థలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలి.**
- **అక్రమార్కులపై నిష్పక్షపాత చర్యలు తీసుకోవాలి.**
- **కాలయాపన బీజేపీ పోరాటం ఉధృతం చేస్తాం.కందుల సంధ్యారాణి.**

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 8:**



ఎల్బీ నగర్‌లో వార్తా కథనాలతో మున్సిపల్ యంత్రాంగం నిద్రమత్తు వదిలి అక్రమ నిర్మాణాలపై జేసీబీలతో విరుచుకు పడటాన్ని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి తీవ్ర స్థాయిలో స్వాగతించారు...ఈ సందర్భంగా వారు ఘాటుగా స్పందిస్తూ, కేవలం ఎల్బీ నగర్‌లోని పిల్లర్ల కూల్చివేతతో అధికారుల బాధ్యత తీరిపోలేదని, రామగుండం నగరంలో సాగుతున్న అక్రమ కబ్జాల పర్వానికి కలెక్టర్ వెంటనే ముగింపు పలకాలంటూ ప్రత్యర్థి వర్గాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తిలక్ నగర్, ఓల్డ్ అశోక్ నగర్, జూనియర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో సైతం 'బాధితుల' పేరిట పెద్ద ఎత్తున మాఫియా చక్రం తిప్పుతోందని ఆరోపించిన ఆమె, రోడ్డు విస్తరణలో నిజంగా సర్వస్వం కోల్పోయిన పేదలకు మాత్రమే ఆ రూములను కేటాయించాలని స్పష్టం చేశారు. బాధితుల సెంటిమెంట్‌ను అమ్ముకుని, ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు తెగబడుతూ గదుల మాయాజాలం నడుపుతున్న అక్రమ లబ్ధిదారులను పక్కాగా గుర్తించి, వారి నిర్మాణాలను కూడా కనికరం లేకుండా నేలమట్టం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కళ్ళముందే కబ్జాలు జరుగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని, అధికారులు ఇప్పటికైనా నిష్పక్షపాతంగా స్పందించి అక్రమార్కుల గుట్టు రట్టు చేయాలని హెచ్చరించారు. ఒకవేళ ప్రజాధనాన్ని, ప్రభుత్వ స్థలాలను దోచుకుంటున్న కేటుగాళ్లకు కొమ్ముకాస్తూ కాలయాపన చేస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని, నగరంలోని నిజమైన బాధితులను, అసలైన లబ్ధిదారులను కలుపుకుని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగానికి నిద్రలేకుండా పెద్ద ఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని కందుల సంధ్యారాణి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

# జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు

- **తొలిసారిగా వస్త్రాలను సృష్టి చేసి లోకానికి అందించిన మహా రుషి భావనారుషి స్వామి అని కొనియాడిన వక్తలు.**

**మణుగూరు. ఆగస్టు 7 (డి డి 9వార్త)**



జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం (ఆగస్టు 7) నాడు మణుగూరు పట్టణంలోని శ్రీ శ్రీ నగర్ లోగల పద్మశాలి భవన్ నందు మణుగూరు పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పద్మశాలీయుల మూల పురుషుడైన భావనారుషి స్వామి చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘం నేతలు మాట్లాడుతూ,మనదేశంలో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని,గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్యధిక మంది ప్రజలకు ఉపాధి కల్పించేది ఈ రంగమే అని పేర్కొన్నారు.సాధారణంగా వీటిని మగ్గాలపై నేస్తారని,మగ్గాలపై నేసే ప్రతి వస్త్రం దేనికదే ప్రత్యేకం అని వారు తెలిపారు. ఈ వృత్తి నైపుణ్యాలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. మన చేనేత కళాకారులు నేసే వస్త్రాలు ఖండాంతర ఖ్యాతి గడిచాయి అని వారు తెలిపారు.మనదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలిచే "చేనేత" కు గుర్తుగా దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవం (National Handloom Day) గా జరుపుకుంటామని, ప్రజలు చేనేత ఉత్పత్తులను వాడేలా ప్రోత్సహించడం, ఈ రంగంలోని కార్మికులను ప్రోత్సహించేలా మద్దతు కల్పించడం దీని యొక్క ముఖ్య ఉద్దేశం అని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత రాష్ట్ర కార్యదర్శి,మణుగూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, గౌరవ అధ్యక్షులు కొరివి బసవయ్య, తుమ్మ లక్ష్మీనారాయణ,కార్యదర్శులు కుర్రి నరసింహారావు, వెన్నం వెంకటరావు,సిరిపురం కోటేశ్వరరావు,గంగిశెట్టి శ్రీనివాసరావు, దాసరి విశ్వేసం, తాటి సత్యన్నారాయణ, దాసరి అనిల్ కుమార్, ఇనగాల వెంకటేశ్వర్లు,ఆమంచి సత్యన్నారాయణ, భోగ గోపి,ఊస కోయల రాజశేఖర్, శ్రీరామ్ రమేష్, అడపా శ్రీనివాస్, ఇనగాల ఇస్తారి, కొరివి రంగయ్య,ఆదిచర్ల కొమరయ్య తదితర పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# అయోధ్య గారి స్థూపావిష్కరణ,ప్రథమ వర్ధంతి సభకు హాజరై, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

- **సరెడ్డి పుల్లారెడ్డి. (సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు)**

**మణుగూరు.ఆగస్టు 7(డి డి 9వార్త)**




సిపిఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, దివంగత నేత, కీర్తిశేషులు కామ్రేడ్ బొల్లో జుఅయోధ్య గారి స్థూపావిష్కరణ, ప్రథమ వర్ధంతి సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి, హాజరైన వివిధ పార్టీల నాయకులు,సిపిఐ రాష్ట్ర,జిల్లా నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు , గ్రామాల ప్రజలు , సహకరించిన ప్రతి ఒక్కరికి, కార్యక్రమానికి వచ్చినటువంటి పట్టణ పురప్రముఖులు,

విద్యావంతులు, వ్యాపారస్తులు, స్వచ్ఛంద సంస్థలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు , రాజకీయాలకి అతీతంగా వచ్చినటువంటి అశేష జన వాహిని కి, పత్రికా సోదరులు ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా,పోలీస్ డిపార్ట్మెంట్, మహిళలు, యువకులు ,కార్మికులు, బి టి పి ఎస్ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు,విద్యార్థులు, ఉద్యోగులు,ప్రతి ఒక్కరూ, సహకరించిన ప్రతి ఒక్కరికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్,మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, వై రాంగోపాల్ ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సర్పంచులు బాడిస కల్పన ,చీడం ఉషారాణి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేరుపుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఎస్కె సర్వర్ ,గిరిజన సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు, వజ్జ వెంకటేశ్వర్లు, కన్నెబోయిన ప్రసాద్,మాజీ సర్పంచ్ బాడిస సతీష్, ఉప సర్పంచ్ పులిగిల్ల రమేష్, నోముల రవి, రాయల బిక్షం, కొత్తపల్లి సీతారాములు, బోలగాని సమ్మక్క, కోడిమేల సుజాత, బోసెట్టి సంపత్, ఎస్వి నాయుడు ఆధార్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో పురుగులు.. చర్యలు తీసుకోవాలని టీఆర్పీ డిమాండ్

**జనగామ ఆగస్టు 7 (డిడి9 వార్త )**



జనగామ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు, రాళ్లు వ స్తున్నాయ నే సమాచారంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జిల్లా యూత్, విద్యార్థి నాయకులు శుక్రవారం పాఠ శాల ను సందర్శించారు. వంటగదిని పరిశీలించి, పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీఆర్పీ జిల్లా యూత్ అధ్యక్షుడు పిట్టల సురేష్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భోజన నాణ్యతను మెరుగుపర్చడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు ప్రారంభం

### గర్భిణీలకు బాలింతలకు తల్లిపాలు వలన కలిగే ప్రయోజనాలు వివరణ



**ఆగస్టు 7 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం గౌరారం పంచాయితీలో గల తాటివారిగూడెం అంగన్వాడి సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలింతలకు గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన మరియు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తల్లిపాల పాత్ర పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు తొలి ఆరు నెలలు పాటు తల్లిపాలు పట్టించడం వలన శిశువుకు అవసరమైన పోషకాలు రోగనిరోధక శక్తి లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరారం సర్పంచ్ శ్యామల రవి వర్మ అంగన్వాడీ టీచర్స్ కుంజ సృజిని తునికి నిర్మల మట్ట యమున కనితి పద్మ కారం వీరమ్మ ఉబ్బ రమణ కనితి రమణ మరియు అంగన్వాడి సిబ్బంది గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- **ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య**
- **ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం**
- **డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు**



**భద్రాచలం, ఆగస్టు 7 (డిడి9 వార్త)**

భద్రాచలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలు కీలకమని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన ఐఎస్ఐ మార్కుగల హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్లతో వాహనాలు నడిపించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా, కాలుష్య నియంత్రణ (పీయూసీ) వంటి వాహన పత్రాలు ఎల్లప్పుడూ చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలి

### భద్రాచలం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్



**భద్రాచలం , ఆగస్టు 7 (డిడి9 వార్త)**

భద్రాచలంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఐటీడీఏ అధికారులతో పాటు వివిధ ఆదివాసీ సంఘాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో గిరిజన ఆదివాసి ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, అధికారులతో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు, ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ ప్రకారము ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, ఆదివాసి వంటకాలతో వారిని ఆనందింప చేసే విధంగా కార్యక్రమాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వచ్చే అతిధులకు మనమిచ్చే ఆతిథ్యంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సభ్యులకు సూచించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు వివిధ ఆదివాసి తెగల గిరిజనులతో ర్యాలీలు, మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై చాయి చిత్ర ప్రదర్శనశాలలో ఏర్పాటులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులతో పాటు ప్రజలకు ఆదివాసి వంటకాలతో భోజన సౌకర్యం కల్పించాలని సంఘ సభ్యులకు తెలిపారు. అలాగే వివిధ తెగల సాంప్రదాయానికి సంబంధించిన సాంస్కృతిక నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేయాలని అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో పనిచేయుచున్న యూనిట్ అధికారులు మీకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి చందన, గురుకులం అర్సీవో అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిఎంజిసిసి సమ్మయ్య, ఏపిఓ పవర్ వేణు, ఏసీఎంఓ రమేష్, డి ఈ విజయ్ కుమార్, ఏటీడీవో రాధమ్మ, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జిసిసి మేనేజర్ జయరాజ్ పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సెంటర్ లోని మన్యం వీరుల విగ్రహాలు, పాత మార్కెట్ లో రాణి దుర్గావతి, కొమరం భీమ్ విగ్రహాలను ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ తెల్లం రమణయ్య, కో-కన్వీనర్ ముర్ల రమేష్, సభ్యులు కుంజా శ్రీను, కుంజా సంతోష్, కొర్స చినబాబు దొర పాల్గొన్నారు.

## ఫతేషాపూర్‌లో బెల్ట్ షాపులపై చర్యలు కోరుతూ వినతి



**జనగామ ఆగష్టు 7(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథపల్లి మండలం పరిధిలోని ఫతేషాపూర్ గ్రామంలో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణను అరికట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని జనగామ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపూర్ గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ చింత నరేష్, ఫతేషాపూర్ ఉపసర్పంచ్ గడ్డం సందీప్ ఎక్సైజ్ అధికారిని కలిసి వినతి చేశారు. ఫతేషాపూర్ గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల కారణంగా మహిళలు, యువతతో పాటు గ్రామీణ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనతో గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## పసిపాపల ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం



**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**

తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తిని ప్రసాదించే అమృతధార వంటివని దేవక్కపేట గ్రామ సర్పంచ్ పూజ అజయ్, సీడీపీవో జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. భీంగల్ మండలం దేవక్కపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధుల బారిన పడకుండా రక్షణ లభిస్తుందని, తల్లులకు సైతం రొమ్ము క్యాన్సర్లు రాకుండా ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. తొలి ఆరు నెలలు మరే ఇతర ఆహారం ఇవ్వకుండా కేవలం తల్లిపాలే పట్టించాలని, అనంతరం అనుబంధ పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు పాలను కొనసాగించాలని బాలింతలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ రాణి, అంగన్‌వాడీ సిబ్బంది రజిత, కరుణ, సరిత, సుశీల, శ్రావణి, అనూష, కనక, ఆశా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో తల్లులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గాండ్ల సురేష్

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా అచ్చా నవీన్ నియామకం.**






**మణుగూరు. ఆగస్టు 7 (డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గాండ్ల సురేష్ నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ నాయక్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకని, బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్నావ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘం బలోపేతానికి, ఉపసర్పంచ్‌లకు సమాజంలో మరియు పంచాయతీ రాజ్ వ్యవస్థలో తగిన గౌరవం దక్కేల క్రియాశీలకంగా వ్యవహరిస్థానని ఈ సందర్భంగా తెలియచేసారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అచ్చా నవీన్ నియమితులయ్యారు.శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం వేదికగా, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ నాయకులు మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధిలో ఉపసర్పంచ్‌ల పాత్ర కీలకమైనదని, వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు అచ్చా నవీన్ జిల్లా స్థాయిలో చురుగ్గా పనిచేస్తారనే నమ్మకంతోనే ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఏకం చేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అచ్చా నవీన్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీ నాయకులకు, సహకరించిన సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి ఒక్కరినీ కలుపుకొని సంఘ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తండ్రి కోసం కూతురు.. భర్త కోసం భార్య పోరాటం

- **ఐదేళ్లుగా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపణ..**
- **తమకు న్యాయం చేసి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని వేడుకోలు**




**భద్రాచలం, ఆగస్టు 7 (డిడి9 వార్త)**

భర్తగా, తండ్రిగా కుటుంబానికి అండగా నిలవాల్సిన వ్యక్తే తమను పూర్తిగా విస్మరించారని ఆరోపిస్తూ భద్రాచలానికి చెందిన విజయలక్ష్మి, ఆమె కుమార్తె వెన్నెల శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న బోళ్ల కాంప్లెక్స్ వద్ద స్థానిక మహిళలతో కలిసి తల్లికూతురు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఐదేళ్లుగా భర్త కోటయ్య కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని, కుటుంబ పోషణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా తమను తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు కుటుంబ పెద్దల సమక్షంలో చర్చలు, భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిగినప్పటికీ ప్రతి సారి కుటుంబాన్ని చూసుకుంటానని హామీ ఇచ్చి చివరకు మాట తప్పారని వాపోయారు. ప్రస్తుతం కోటయ్య భద్రాచలం వదిలి వెళ్లిపోయి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఆచూకీ కూడా తెలియకుండా ఉన్నారని, అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. విజయలక్ష్మి మాట్లాడుతూ.. తన మామ (భర్త తండ్రి) మల్లికార్జున్ పలుమార్లు తనను లైంగికంగా వేధించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ విషయాన్ని భర్త కోటయ్యతో పాటు మల్లికార్జున్ భార్య మణెమ్మ, కుమార్తె గంగ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ తన మాట నమ్మలేదని, పైగా తనకే మానసిక సమస్య ఉందంటూ బలవంతంగా హైదరాబాద్‌లోని మానసిక ఆస్పత్రిలో చేర్పించారని ఆరోపించారు. అయితే తనకు ఎలాంటి మానసిక సమస్య లేదని వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా తన కుమార్తె వెన్నెల పట్ల కూడా మల్లికార్జున్ అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించారని, అందుకే కుమార్తె తన వద్దే ఉంటోందని పేర్కొన్నారు. భర్తకు వ్యాపారాలు, ఇళ్లు, స్థలాలు సహా ఆస్తులు ఉన్నప్పటికీ తమను రోడ్డున పడేశారని, ఈ వ్యవహారంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వెన్నెల మాట్లాడుతూ.. తాను పదో తరగతి చదువుతున్నప్పటి నుంచే తండ్రి తమను పూర్తిగా పట్టించుకోవడం మానేశారని, ప్రస్తుతం యూనివర్సిటీ ఫీజు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడడంతో చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి మానసిక రోగి కాదని వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ కావాలనే అపవాదు మోపారని, పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపింది. తమ భర్త, తండ్రిని గుర్తించి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, తమకు చట్టపరమైన న్యాయం చేసి జీవనోపాధి, చదువు కొనసాగేందుకు అవసరమైన సహాయం అందించాలని సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని తల్లి, కుమార్తె విజ్ఞప్తి చేశారు.

## భద్రాద్రి మనుగడకు పోలవరం పెనుముప్పు






- **ఆంధ్రాలో కలిపిన 5 పంచాయతీలను తెలంగాణకు ఇవ్వాలి**
- **ఇసుక లారీలతో ఏజెన్సీ రోడ్లు ధ్వంసం.. వెంటనే మరమ్మతులు చేయాలి**
- **సీతారామ ప్రాజెక్టు ద్వారానే జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి**
- **జిల్లాలో సాగిన ప్రజా చైతన్య యాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్‌పాషా**

**భద్రాచలం , ఆగస్టు 7 (డిడి9 వార్త)**

రాష్ట్ర విభజన సమయంలో అశాస్త్రీయంగా ఆంధ్రాలో కలిపిన ఐదు గ్రామపంచాయ తీలను తెలంగాణ తిరిగి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్‌పాషా అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండవ రోజు యాత్ర శుక్రవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక లో ప్రారంభమై భద్రాచలం మీదుగా దుమ్ముగూడెం చర్ల మండలాలను కలుపుకొని చర్ల మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో ముగిసింది. భద్రాచలం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష మాట్లాడుతూ ప్రజల హక్కులు, అస్తిత్వం, గిరిజనుల భవిష్యత్తును కాపాడేందుకు రాష్ట్వవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, దేవస్థానానికి చెందిన భూములు, ఆస్తులు ఆంధ్రప్రదేశ్ లో ఉండడం చారిత్రకంగా, పరిపాలనా పరంగా, ఆధ్యాత్మికంగా సమంజసం కాదన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సమృద్ధిగా సాగునీరు అందించి అ తర్వాత తరలించుకు పోవాలని చెప్పారు. అలాగే ఎన్నో ఏళ్లుగా నిరీక్షణలో ఉన్న ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని, పోలవరం ప్రాజెక్టు భద్రాద్రి జిల్లా మనుగడకే పెను సవాలుగా మారిందని పాషా ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాక్ వాటర్ ప్రభావంతో గిరిజన గ్రామాలు, వ్యవసాయ భూములు, అడవులు, జీవనాధారాలు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. భద్రాద్రి ప్రజల ఆస్తులు, ప్రాణాలు, హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి వర్షాకాలంలో గోదావరి వరదలు భద్రాచలం పట్టణంతో పాటు అనేక గ్రామాలకు శాపంగా మారుతున్నాయని, అయినప్పటికీ శాశ్వత పరిష్కారంపై పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. గోదావరి వరద ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు నదీ తీరంలో శాస్త్రీయ ప్రమాణాలతో బలమైన కరకట్టలు నిర్మించి శాశ్వత వరద నియంత్రణ ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ ఖాళీల భర్తీపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇసుక లారీల కారణంగా వాజేడు నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైందని కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు సంపాదించుకుంటూ ఏజెన్సీ రహదారులను సర్వనాశనం చేస్తున్నారని వెంటనే రహదారికి మరమ్మత్తులు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు, సహజ వనరులు, రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంటూ, ఏజెన్సీ ప్రాంత పరిరక్షణ కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని పాషా స్పష్టం చేశారు. ముప్పా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభమైన రెండవ రోజు చైతన్య యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరు వెంకటేశ్వరరావు, మేయర్ మూడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, సాధనపల్లి సతీష్, కంభంమెట్టు శ్రీను పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన షైన్ స్కూల్ కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా

**బోనకల్,ఆగస్టు 07,(డీడీ9 వార్త):**

ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలానికి చెందిన విజన్ ఆంధ్రా దినపత్రిక విలేకరి మందా సత్యనందం కుటుంబాన్నీ శుక్రవారం షైన్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్లు లాల్ మహమ్మద్,సిరి ఫర్హాద్ లు పరామర్శించారు,విలేకరి సత్యానందం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, అనంతరం సత్యానందం సతీమణికి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో షైన్ హై స్కూల్ ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి,షేక్ ఖాజా పాషా తదితరులు ఉన్నారు.

# ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు

### జారే ఆదినారాయణ...

**అశ్వరావుపేట:ఆగస్టు07(డిడి 9వార్త)**



దమ్మపేట మండలం కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన దమ్మపేట MRO కార్యాలయంలో బోర్‌వెల్, మరుగుదొడ్ల బ్లాక్ ప్రారంభ పనులకు శ్రీకారం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేస్తున్నామని గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు మండలంలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు

**పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం**

దమ్మపేట మండలం పార్కలగండి పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు సొంత ఇల్లు లేని అనేక కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు

**ప్రజల సౌకర్యం కోసం MRO కార్యాలయంలో వసతులు**

అనంతరం దమ్మపేట MRO కార్యాలయంలో బోర్‌వెల్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు వివిధ పనుల కోసం ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీటి అవసరాలు తీర నున్నయాన్నారు అదేవిధంగా కార్యాల యానికి వచ్చే ప్రజలు సందర్శకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళాశక్తి క్యాంటీను,మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి**

వనమహోత్సవంలో భాగంగా పలు చోట్ల మొక్కలు నాటారు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు వనమహోత్సవం లాంటి కార్యక్రమాల ద్వారా గ్రామాలు పట్టణాల్లో పచ్చదనం పెంచడం పర్యావరణాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని దశల వారీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని అన్నారు ఈ కార్యక్రమాల్లో ట్రైనింగ్ కలెక్టరు(MRO దమ్మపేట )M మురళి గారు,స్థానిక సర్పంచు కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీహార్‌లోని పునౌరా ధామ్‌లో భవ్య ఆలయ పునర్నిర్మాణం

- భారతీయ సంస్కృతికి మరో గర్వకారణం
- ఆర్ఆర్సిఎన్విపి & ఎస్ఐ కన్వీనర్ యర్రం వెంకటరెడ్డి

**న్యూ ఢిల్లీ,ఆగస్ట్ 7,(డిడి9 వార్త):**




బీహార్ రాష్ట్రంలోని సీతామఢి జిల్లాలో ఉన్న పునౌరా ధామ్‌లో సీతామాతకు భవ్యమైన ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వానికి గర్వకారణమని రామాయణ్ రీసెర్చ్ కౌన్సిల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఇండియా కన్వీనర్ యర్రం వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీతాదేవి భారతీయ నారీత్వానికి, పవిత్రతకు, త్యాగానికి, సహనానికి, అచంచలమైన ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని ఆయన అన్నారు. లక్ష్మీదేవి అవతారమైన సీతామాత తన జీవితం ద్వారా ధర్మం, కుటుంబ విలువలు, మాతృత్వం, ఆత్మగౌరవం వంటి శాశ్వత విలువలను ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. శ్రీరాముడు వనవాసానికి వెళ్లినప్పుడు రాజ భోగాలను త్యజించి భర్త వెంట అడవులకు వెళ్లడం, లంకలో రావణుడి ప్రలోభాలు, బెదిరింపులకు ఏమాత్రం లొంగకుండా ధైర్యంగా నిలవడం, అగ్నిపరీక్ష ద్వారా తన పవిత్రతను నిరూపించడం సీతాదేవి మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనాలని వివరించారు. అలాగే వాల్మీకి మహర్షి ఆశ్రమంలో లవ, కుశులను ధర్మవీరులుగా తీర్చిదిద్దిన ఆదర్శ మాతగా సీతామాత చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. భూమాత పుత్రికగా జన్మించిన సీతాదేవి జీవితమంతా ఓర్పు, క్షమ, ధర్మబద్ధతకు ప్రతీకగా నిలిచిందన్నారు. పునౌరా ధామ్‌లో నిర్మితమవుతున్న ఈ ఆలయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా, భారతీయ సంస్కృతి వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని యర్రం వెంకటరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సీతాదేవి ఆదర్శాలను భావితరాలకు చేరవేసే పవిత్ర క్షేత్రంగా ఈ ఆలయం నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయాలనీ ఆదివాసి ప్రజాసంఘాలు

**మంగపేట ఆగస్టు07డీడీ9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుండి ప్రతి గ్రామం ప్రతి గూడెం నుండి అధిక సంఖ్యలో పాల్గొని మంగపేట మండల కేంద్రము లో ఘనంగా నిర్వహించబోతున్నాం కావున మండలంలోని ఆదివాసి ప్రజలు, ప్రజా ప్రతినిధులు విద్యావంతులు మహిళా సంఘాల నాయకులు ఆశ కార్యకర్తలు ఆరోగ్య శాఖ వారు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు విద్యాశాఖ వారు అంగన్వాడీలు విద్యార్థి సంఘం నాయకులు ప్రజాసంఘాల నాయకులు మేధావులు ఆదివాసి శ్రేయోభిలాషులు అందరూ సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగపేట మండలం ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు కోరుతూ ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు చాద మల్లయ్య, నల్లబోయిన లక్ష్మణ్ దొర,పొదెం నాగేష్, ఎట్టి సారయ్య, ఆక తిరుమల



రావు.సోయం ఈశ్వర్, తాటి నాగరాజు, పునెం ప్రశాంత్. తదితరులు పాల్గొన్నారు

# మెచ్చా మాటతో గుమ్మడవల్లి ప్రాజెక్టు గేట్లు దింపిన అధికారులు!

- వర్షా లు లేక ఇబ్బంది పడుతున్న రైతులు పడక పడక వర్షం పడితే ప్రాజెక్టు గేట్లు తెలిసే ఉంచిన వైనం..
- రైతుల సమస్యపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు...

**అశ్వరావుపేట:ఆగస్టు07 (డిడి 9 వార్త)**





అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయి చాలాకాలం గడుస్తున్నప్పటికీ, రింగుబండ్ నిర్మించారు నీటి నిల్వకు స్థానిక ఎమ్మెల్యే ,ముగ్గురు మంత్రులు ఉన్నరాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు నీరు రైతులకు ఉపయోగ పడకుండానే వృథాగా పోతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ఇటీవల స్థానిక రైతులు ★అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ MLA,BRS పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ★ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్న మెచ్చా నాగేశ్వరరావు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రాజెక్టు గేట్లను దింపి నీటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నీటిపారుదల అధికారులను కోరారు మెచ్చా నాగేశ్వరరావు సూచనపై స్పందించిన అధికారులు గేట్లను దింపడంతో ప్రాజెక్టు నీటిని సాగుకు వినియోగించుకునే అవకాశం రైతులకు లభించింది. దీంతో తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మెచ్చా నాగేశ్వరరావుకి ఆయకట్టు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు రైతుల సమస్యలపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# ప్రథమ శ్రేణి విద్యార్థినికి రూ.11 వేల ప్రోత్సాహక బహుమతి

- విద్యార్థిని తల్లి, ప్రధానోపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్

**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**



పెద్దకొడప్‌గల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని సాబ్లె నందిని తరఫున ఆమె తల్లి జేవంతి మధుసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్ రూ.11 వేల విలువైన ప్రోత్సాహక చెక్కును మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, నందిని తల్లి జేవంతి మధుసింగ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాల పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు.ఉపాధ్యాయుల తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఇన్‌చార్జి విద్యాధికారి ప్రవీణ్ కుమార్‌ను మల్లప్ప పటేల్ శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం ద్వారా సమాజ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ. యాదవ్, మూడ్ శంకర్, ఆర్. లలిత, వి. సునీత, ఎం. సుజాత, ఎం. భక్షిరామ్, జి. మంజుల, పి. అశోక్, దేవదాస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కుల హక్కులకే కాదు..

### పేద చిన్నారుల గుండె చికిత్స కోసం మందకృష్ణ మాదిగ పోరాటం చారిత్రాత్మకం...




**ఆగస్టు07 డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన చిన్నారుల గుండెజబ్బులకు ఉచిత వైద్యం అందించేందుకు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సామాజిక ఆరోగ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. కేవలం సామాజిక హక్కుల కోసం మాత్రమే కాకుండా మానవతా దృక్పథంతో ఆయన చేసిన ఉద్యమం అనేక మంది పేద చిన్నారుల ప్రాణాలను కాపాడిందని తెలిపారు. 2004లో గుండెజబ్బుతో బాధపడుతున్న నసీమ అనే బాలికకు వైద్యం కోసం అవసరమైన నిధుల కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం అనంతరం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత గుండె వైద్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించడంతో పాటు పేద చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు అందించే చర్యలు చేపట్టిందన్నారు. ఈ పోరాటం తర్వాతి కాలంలో ఉచిత వైద్య సేవల విస్తరణకు పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుగ్గిల నరేంద్ర మాదిగ, యాసం మహేష్ మాదిగ, మల్లికార్జున్ మాదిగ, సంపత్ మాదిగ, సంతోష్ మాదిగ, వావిలాల ప్రసాద్ మాదిగ, చిన్నం సత్యం మాదిగ, సమ్మయ్య మాదిగ, సంజీవ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుకు గురై మహిళ మృతి

**డిడి9 వార్త గుడిహత్నూర్:**



మండలంలోని తోషం గ్రామానికి చెందిన ముడి మడుగుల రాజాలక్ష్మి (53) పాము కాటుకు గురై మృతి చెందిందని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..గురువారం ఇంట్లో పనులు చేస్తుండగా రాజాలక్ష్మి ని పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.రిమ్స్‌లో వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో సాయంత్రం 5.16 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ ఘటనతో తోషం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తల్లిపాలే శిశువులకు శ్రీరామరక్ష



**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**

బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించడం వల్ల శిశువుకు అపరిమితమైన రోగనిరోధక శక్తి లభిస్తుందని, ఇది బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు శ్రీరామరక్షగా నిలుస్తుందని పిప్రి గ్రామ సర్పంచ్ అరిగెల జనార్ధన్ స్పష్టం చేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పిప్రి గ్రామంలో పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... మొదటి ఆరు నెలల పాటు పసిపాపలకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆ తర్వాత తగిన పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు తాగే పిల్లల్లో అంటువ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పతాని రంజిత్, గ్రామ కార్యదర్శి జితేందర్, వీడీసీ సభ్యుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు మేఘన, అర్చన తదితరులు పాల్గొని మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై చైతన్యం కలిగించారు.

## బోనం ఎత్తుకురా వీడియో పాట చిత్రీకరణ ప్రారంభం



**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**

ప్రముఖ రచయిత, గాయకుడు కొండవీటి శ్యామ్ ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిస్తున్న బోనం ఎత్తుకురా పాట వీడియో చిత్రీకరణను కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామ దేవి ఆలయంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ బైకాని జమున మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల నేపథ్యంతో పాటను తెరకెక్కించడం అభినందనీయమన్నారు. మహిళలు నిర్వహించిన బోనం నృత్యాలు, ఊరేగింపు తీరు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. ఈ పాట పెద్ద హిట్ అయి ప్రేక్షకాదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్శకుడు కొండవీటి శ్యామ్ ప్రసాద్, కెమెరామెన్ సంతోష్, నృత్య దర్శకురాలు శైనిక, కళాకారులు వైశాలి, ఆశ్రిత, హరిత, నటులు మంద ప్రభాకర్, సతీష్, మంచిర్యాల ప్రభాకర్, వెంకట్, తాళ్ల రవి, మాస్టర్ ఆశ్రిత్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ పంతులు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

### ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త)**

తలమడుగు మండలం పల్లి బి గ్రామానికి చెందిన. మోతి అశోక్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో.బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. వారి గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలను. వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనిల్ జాదవ్ మాట్లాడుతూ. అతని మరణానికి కారణం పంట కొరకు చేసిన అప్పులు తీరక మానసిక క్షోభకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి.రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. ఒక వైపు ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు సమృద్ధిగా కురవక. విత్తనాలు మొలకెత్తగా ఇంకోవైపు సంపూర్ణ రైతు రుణమాఫీ జరగక. సరిపడా ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం స్పందించి. చనిపోయిన రైతు కుటుంబానికి. 20 లక్షల ఆర్థిక సాయం అందించి. చనిపోయిన రైతు మోతి అశోక్ కుటుంబాన్ని ఆదుకోవాలని. ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు. పలువురు నాయకులు గ్రామస్తులు. ఉన్నారు

## మానవత్వం చాటుకున్న 'నితిన్ ఫౌండేషన్'

### తొలిరోజే రూ. లక్ష చెక్కు పంపిణీ



**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**

సమాజంలో నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా కొత్తగా ఏర్పాటైన 'నితిన్ కన్సల్టెన్సీ ఫౌండేషన్' ప్రారంభోత్సవ రోజే తమ ఉదారతను చాటుకుంది. కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన కోలా నితిన్ నూతనంగా ప్రారంభించిన ఈ ఫౌండేషన్ ద్వారా గ్రామానికి చెందిన ఒక పేద మహిళ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ చెక్కును సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సతీష్, గ్రామ సర్పంచ్ జమున మహేష్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. సామాజిక సేవా దృక్పథంతో ముందడుగు వేసిన ఫౌండేషన్ నిర్వాహకుడు నితిన్‌ను ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూమేష్, పృథ్వీరాజ్, బందెల రాజు, మోహన్, ఉదయ్, నితిన్, దేవేందర్, రాకేష్, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పనుల్లో నాణ్యత ఉండాలి: ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**



విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తెలిపారు. అంకాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున చెట్ల పెంపకం చేపట్టడంపై జిల్లా అటవీ శాఖ అధికారులతో సమీక్షించారు. పాఠశాల ప్రాంగణాన్ని మోడల్ గ్రీనరీగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అటవీ అధికారులకు సూచించారు.

## నర్సాపూర్ శివారులో భూ రీ-సర్వే

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల 'రీ-సర్వే' ప్రక్రియలో భాగంగా బోధన్ మండలం నర్సాపూర్ శివారులో శుక్రవారం రీ-సర్వే నిర్వహించారు. మండల పరిధిలోని సర్వే నంబర్ 881లో గల 4.00 ఎకరాల విస్తీర్ణమున్న భూమి సరిహద్దులను బోధన్ ఆర్డీవో విజయ కుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భూ రికార్డులను పక్కాగా నమోదు చేయాలని, సరిహద్దుల లెక్కింపు పారదర్శకంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్ డీఐఓఎస్ ఏ. దత్తు, తహశీల్దార్ పీ. విఠల్, లైసెన్స్‌డ్ సర్వేయర్ శివరాజ్, సంబంధిత సర్వే నంబర్ అనుభవదారులు, భూ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## భీంగల్ అభివృద్ధిపై ఆధారాల్లేని ఆరోపణలొద్దు

### బీఆర్ఎస్ వైఖరిపై కాంగ్రెస్ నాయకుల ధ్వజం

**నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**




తమ పదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకత్వంపై బురదజల్లుతున్నారని భీంగల్ మండల కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతల తీరును ఎండగట్టారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొనకంటి నరసయ్య పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై చేసిన చవకబారు వ్యాఖ్యలను తిప్పికొట్టారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హయాంలో భీంగల్‌లో చెక్ డామ్‌ల పేరిట కమిషన్లు కక్కుర్తి పడ్డారని, నాసిరకం నిర్మాణాల వల్ల బెజ్జోర చెక్ డామ్ పరిధిలో ఏకంగా 70 ఎకరాల పంట భూములు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో అనేక అక్రమాలు జరిగాయని, అర్హులైన పేదలకు కాకుండా పక్షపాతంతో కేటాయింపులు చేశారని ఆరోపించారు. మైనారిటీలకు ఇచ్చిన ఈద్గా రహదారి హామీని, క్రైస్తవుల స్మశానవాటిక కేటాయింపులను విస్మరించిన బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించే నైతిక అర్హత లేదని మల్లెల లక్ష్మణ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక శ్రద్ధతో భీంగల్ మున్సిపాలిటీకి రూ.26.50 కోట్ల నిధులు రాబట్టారని తెలిపారు. రూపాయి కమిషన్ లేకుండా ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా అందిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న 100 పడకల ఆసుపత్రి నిధులను సైతం విడుదల చేయించామని చెప్పారు. నాయకుడు ఖండే కాంతయ్య మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దూషణలకు దిగితే ఉపేక్షించేది లేదని, ప్రజల్లోనే బీఆర్ఎస్ నకిలీ ప్రచారాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రతినిధులు అరిగిన జనార్ధన్, సతీష్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువులకు సంపూర్ణ రక్షణ







### మునిస్పల్ చైర్మన్ పద్మావతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**

పుట్టిన తొలి గంటలోనే శిశువుకు పాలు పట్టించడం అమృత బిందువు వంటిదని, ఇది బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, రోగనిరోధక శక్తికి సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ తూమ్ పద్మావతి శరత్ రెడ్డి తెలిపారు. బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశ హాల్ లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అదనంగా నీరు కానీ ఇతర ఆహారం కానీ ఇవ్వాల్సిన అవసరం లేదని వివరించారు. సీడీపీఓ నందిని మాట్లాడుతూ... తల్లిపాలు బిడ్డను అంటువ్యాధుల నుంచి కాపాడటమే కాకుండా, తల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ ఇద్దరి మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విద్య, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక వ్యతిరేక బిజెపి విధానాలపై పోరు

### ఈ నెల 10న జైలు భరోను జయప్రదం చేయండి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 07(డీడీ9 వార్త) :**



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా తలపెట్టిన 'జైలు భరో', రాస్తారోకో కార్యక్రమాలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు, అనుబంధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు బి.మల్లేష్, జే.శంకర్ గౌడ్, పి.వరదయ్య మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలని, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీవన వేతనాలు ఇవ్వడంతో పాటు స్కీమ్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని కల్పిస్తూ రోజువారీ కూలీ రూ.700 చెల్లించాలని కోరారు. పంటలకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ఇవ్వాలని, విత్తన బిల్లు సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్. రమేష్, చాందు, దయాల్ సింగ్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 07, :**

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి పురోగతి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, తదితర అంశాలపై శాఖల వారీగా మంత్రి సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో మరో నకిలీ వ్యక్తి డాక్టర్‌గా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డి సి హెచ్ ఎస్ , ఆసుపత్రి సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీహెచ్ సి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల నమోదైన కేసుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎం సి హెచ్ లనుత్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జిజిహెచ్ లో అవసరమైన ఎక్విప్మెంట్, మందులు అందుబాటులో ఉండాలని, నిరంతరం పర్యవేక్షించాలని జి జి హెచ్ సూపరింటెండెంట్ కు సూచించారు. విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518